క్లుప్తంగా

‘తలనీలాల మాయం’పై నివేదిక ఇవ్వండి

సాక్షి ఎఫెక్ట్..

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ యాకూబ్ బాబా దర్గాలో భక్తులు సమర్పించే తలనీలాలు మాయం చేస్తున్నట్లు ఈనెల 15న ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ సత్యశారద స్పందించారు. ఈ మేరకు విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని జిల్లా మైనార్టీ అధికారి ద్వారా వక్ఫ్‌బోర్డు ఆఫీసర్‌ను ఆమె ఆదేశించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో తలనీలాలకు రూ.28 లక్షల వేలం జరగ్గా 2023–24లో వేలం నిర్వహించకుండానే కేవలం రూ.7 లక్షలు వక్ఫ్‌బోర్డుకు జమ చేయడంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలను వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ రియాజ్ ధ్రువీకరించారు.

ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని గెలిపించాలని ప్రచారం

గీసుకొండ : ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోమారు గెలిపించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు ఇసంపల్లి బాబు, సీఐటీయూ నాయకుడు తొగటి బ్రహ్మచారి ఆదివారం గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సిరెడ్డి గెలిస్తే ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేట రోడ్డులోని గౌడ సంఘం అడ్డా వద్ద తెలంగాణ గీత పనివారల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి తిరుపతి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలోని గీత కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం తొలిసారిగా చట్టం తీసుకొచ్చేలా పార్లమెంటులో మాజీ ఎంపీ బొమ్మ ధర్మభిక్షం కృషి చేశాడని తెలిపారు. ధర్మభిక్షం స్ఫూర్తితో గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం పోరాడుతోందని చెప్పారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాలకుర్తి కృష్ణ, చిర్ర శ్రీనివాస్‌గౌడ్, ఇల్లందుల సాంబయ్య, అల్వాల రమేష్, వేముల సాంబయ్య, నాతి సదానందం, గండు శ్రీనివాస్, గోపగాని సందీప్, సట్ల రజనీకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ‘వెలుగుల బడి’ ప్రారంభం

పర్వతగిరి : జేడీ ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు మండలంలోని ఏనుగల్‌లోని గ్రంథాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) వెలుగుల బడి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఫౌండేషన్ టీమ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువున్న విద్యార్థులకు నేటి నుంచి స్కూల్ టైం పూర్తయిన తర్వాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఉచితంగా ట్యూషన్ చెప్పడంతోపాటు పిల్లలకు స్నాక్స్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రారంభ కార్యక్రమానికి ఫౌండేషన్ తెలంగాణ కన్వీనర్ కవితరెడ్డి, అనంతలక్ష్మి హాజరు కానున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు, యువత, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

సంగెం : మండల కేంద్రంలో నేడు (సోమవారం) గిరిజనుల ఆరాధ్య దైవం అయిన సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుక నిర్వహిస్తామని మాజీ జెడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా భోగ్ భండారో, మహాఅన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేడుకకు ముఖ్యఅతిథిగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరవుతారని వివరించారు. మండలంలోని గిరిజనులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నివాళి



నర్సంపేట : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తల్లి అయిన గోగుల జయశ్రీ ఆదివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాణిరుద్రమ, రాణాప్రతాప్‌రెడ్డితోపాటు మృతురాలి సోదరుడైన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రాయిడి రవీందర్ రెడ్డిని, బాధిత కుటుంబాన్ని సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు.

సోలార్ కంచెతో పంటల రక్షణ

- వానరాలు, వన్యప్రాణుల బెడదకు చెక్
- రైతన్నపై ఆర్థికభారం

సంగెం : మండలంలోని పలు గ్రామాల్లోని పంట చేలల్లో వానరాలు, వన్యప్రాణుల బెడద నెలకొంది. రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటలను కాపాడుకునేందుకు రైతులకు అదనపు కష్టాలు తప్పడం లేదు. విత్తనం నాటిన నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు పంటలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదమరిస్తే పంటలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉండడంతో రైతులు తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే రైతులు ఖర్చు ఎక్కువైనా పంటలకు రక్షణ కోసం సోలార్ కంచెల ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు. రైతుల ఆలోచనల్లో మార్పులు కళ్లకు కడుతున్నాయి. ప్రాణహాని లేని ఆధునిక విధానంలో భాగంగా సోలార్ కంచె ఏర్పాటు చేసుకుంటూ పంటలను రక్షించుకుంటున్నారు.

విభిన్న పద్ధతుల్లో....

మండలంలోని నర్సానగర్, ఎల్గూర్‌స్టేషన్, ఎల్గూర్ రంగంపేట, తిమ్మాపూర్, మొండ్రాయి, నల్లబెల్లి, పల్లారుగూడ, చింతలపల్లి, తదితర గ్రామాల్లోని రైతులు మొక్కజొన్న పంటలను పక్షులు, వానరాలు, వన్యప్రాణుల నుంచి రక్షించుకునేందుకు విభిన్న పద్ధతులను అవలంభిస్తున్నారు. పక్షుల నుంచి రక్షణ కోసం అట్టముక్కలను వేలాడిదీసి సమాంతరంగా బీర్ బాటిల్, నట్‌బోల్టు కట్టి ఉంచుతున్నారు. గాలికి అట్టముక్క ఊగినపుడు నట్టుబోల్టు బీర్‌బాటిల్‌కు తగిలి శబ్దం వస్తుండడంతో పక్షులు చేనుపై వాలకుండా ఎగిరి పోతున్నాయి.



రైతు ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

ఇంకొందరు మినీ మైక్‌లను ఏర్పాటు చేసి కుక్కల అరుపులు వినిపిస్తూ వానరాలు, వన్యప్రాణులు రాకుండా కొంతమేరకు అడ్డుకట్ట వేస్తున్నారు. మరికొందరు వానరాలు పంట చేలల్లోకి రాకుండా చీరల పరదాలు కడుతున్నారు.

సోలార్ కంచె ఏర్పాటు

పగటిపూట వానరాలు, రాత్రిపూట నక్కలు, అడవి పందుల బెడద నివారించేందుకు రైతులు సోలార్ కంచె ఏర్పాటు చేస్తున్నారు. ఎల్గూర్‌రంగంపేటకు చెందిన పసునూటి అశోక్ రూ.9500 వెచ్చించి సోలార్ ప్యానెల్, రూ.8 వేల వ్యయంతో ఐరన్ జే వైర్ కొనుగోలు చేసి స్తంభాలు పాతేందుకు రూ.3 వేలు, తీగ అమర్చినందుకు రూ.4 వేలు ఖర్చు చేసి నాలుగెకరాల మొక్కజొన్న పంటకు రక్షణ ఏర్పాటు చేసుకున్నాడు. ఇంత పెట్టుబడి రైతులకు భారంగా ఉంటోంది. ప్రభుత్వం సబ్సిడీపై సోలార్ కంచెలు ఏర్పాటు చేయించే దిశగా కార్యాచరణ చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోతులను అడవుల్లో వదిలేయాలి



పంటల సాగుకు పెట్టుబడులు పెట్టి కాపాడుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పంటలు ఆశించిన మేరకు పండినా కోతులు, ఇతర వన్యప్రాణులు పంటలను నాశనం చేస్తున్న దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆర్థికంగా భారీగా నష్టపోతున్నాం. కోతులు, వన్యప్రాణుల నుంచి పంటలను రక్షించుకునేందుకు అనేక తిప్పలు పడుతున్నాం. ప్రభుత్వం, అధికారులు స్పందించాలి. కోతులను పట్టించి అడవుల్లో వదిలేయాలి. తద్వారా కొంత మేరకైనా ఇబ్బందులు తొలగిపోతాయి.

– వేల్పుల సారంగపాణి, రైతు, చింతలపల్లి

సబ్సిడీపై ఏర్పాటు చేయించాలి



పంటలను వానరాలు, వన్యప్రాణుల నుంచి కాపాడుకునేందుకు ఇబ్బంది పడుతున్నాం. వందల సంఖ్యలో కోతులు చేనుపై దాడి చేస్తున్నాయి. సుమారు రూ.25 వేలు వెచ్చించి సోలార్ కంచెను ఏర్పాటు చేయించా. దీంతో వానరాలకు, వన్యప్రాణులకు ప్రాణాపాయం లేకుండానే పంటలను కాపాడుకోగలుగుతున్నా. ప్రభుత్వం రైతుల ఇబ్బందులు తొలగించేలా సబ్సిడీపై పంటలకు సోలార్ కంచె ఏర్పాటు చేయించాలి.

– పసునూరి అశోక్, రైతు, ఎల్గూర్ రంగంపేట

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

- ‘ఆర్‌డీఎఫ్’ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్

పర్వతగిరి : విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుతపాయ్ విద్యాలయ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ ఆకాంక్షించారు. మండలంలోని కల్లెడలోని ఆ కళాశాలలో ఆదివారం మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సంవత్సరం పూర్తి చేసుకోనున్న విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు కళాశాలలో తమ రెండేళ్ల అనుభవాలను జూనియర్లతో పంచుకున్నారు. అనేక విషయాలను గుర్తు చేసుకున్నారు. నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా సమావేశంలో ప్రిన్సిపాల్ జనార్దన్ మాట్లాడారు. ఇంటర్ విద్య పూర్తి చేసుకుంటున్న విద్యార్థులు బంగారు భవిష్యత్తు దిశగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని పరీక్షల్లో ప్రతిభ చాటి ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రుల, కళాశాల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని కోరారు. సీనియర్ల స్ఫూర్తితో జూనియర్ ఇంటర్ విద్యార్థులు చదువుల్లో, ఆటపాటల్లో రాణించాలని తెలిపారు. తద్వారా మెరుగైన జీవితానికి బాటలు వేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపకులు సుధాకర్, సైదులు, సంతోశ్, శ్రీనివాస్, జయశంకర్, హైమావతి, మహేశ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

రాయపర్తి : మండలంలోని మైలారంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణ పనులను బీఆర్‌ఎస్ పాలకుర్తి నియోజకవర్గ నేత, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ముగ్గుపోసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ముదిరాజ్ కులస్తుల విన్నపం మేరకు ఆలయ నిర్మాణానికి తోడ్పాటు అందిస్తామని తాను ఇచ్చిన హామీ మేరకు తన సొంత డబ్బుతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మండలంలోని అన్ని కులాల ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని, ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవలు అందిస్తామని చెప్పారు.

అనారోగ్య పీడితులకు సాయం

మండలంలోని శివరామపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న తాటికాయల యాకమ్మ, తాటికాయల రాజు, చెడుపాక ఉప్పలయ్యలకు బీఆర్‌ఎస్ నేత, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. అనంతరం మైలారంలో అనారోగ్యంతో బాధపడుతున్న గబ్బెట వెంకన్నకు వైద్యం కోసం రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు లేతాకుల రంగారెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, బైరు యాకన్న, సంది దేవేందర్‌రెడ్డి, లేతాకుల మహేందర్‌రెడ్డి, గబ్బెట కొమురయ్య, కోల సంపత్, ముదిరాజ్ కుల పెద్దలు బోయిని కొమురయ్య, బోయిని కుమార్, ఈర్ల మల్లయ్య, కనుకుంట్ల సోమయ్య, బోయిని చిన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కార్యకర్తలపై అక్రమ కేసులు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహనాయక్

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహ

రాయపర్తి : బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం సరికాదని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌తో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింహ మాట్లాడారు. ఇటీవల జరిగిన దుర్గమ్మ, మారెమ్మ ఉత్సవాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల నడుమ తోపులాట చోటు చేసుకోగా బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అధికార బలంతో తప్పుడు కేసులు బనాయించారని చెప్పారు. పార్టీ శ్రేణులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుండగా దాడి చేయడంతోపాటు కేసులు పెట్టించడం హేయమన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే మోసపూరిత రాజకీయాలు మానుకుని అభివృద్ధి పనుల మీద దృష్టి సారించాలని హితవు పలికారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు బందెల బాలరాజు, తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, గారె నర్సయ్య, ఐత రాంచందర్, గజవెల్లి ప్రసాద్, ముద్రబోయిన సుధాకర్, కొమ్ము రాజు, చెడుపాక కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంతతో ప్రమాదాలు.. అధికారుల నిర్లక్ష్యం

- ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి నరేశ్

నల్లబెల్లి : మండలంలోని ముచ్చింపుల ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతతో ప్రమాదాలు జరుగుతున్నాయని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ తెలిపారు. ఈ మేరకు గుంత వద్ద గ్రామస్తులతో కలిసి ఫెడరేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడారు. రోడ్డు మార్గంలో ప్రతిరోజూ వందలాదిగా ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. ఈ రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలో పడి ద్విచక్ర వాహనదారులు గాయాల పాలవుతున్నారని చెప్పారు. తరచూ ప్రమాదాలు జరుగుతుండగా గుంతను పూడ్చాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వీడి గుంతను వెంటనే పూడ్చివేయించి ప్రమాదాల నివారణకు చొరవ చూపాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల ప్రతాప్, కుమారస్వామి, పాలకుర్తి శ్రీనివాస్, సంగూలాల్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



గుంతను చూపుతున్న నరేశ్, తదితరులు

‘ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి’



వర్ధన్నపేట : ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్‌ఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశానికి కంజర్ల సమ్మయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కుమారస్వామి హాజరై మాట్లాడారు. గడచిన 3 దశాబ్దాలుగా పాలకులు ఎస్సీ వర్గీకరణ, కులగణనపై దృష్టి సారించలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎస్సీ వర్గీకరణ, కులగణనపై చొరవ చూపడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గత సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఎస్సీ జనాభా 10 శాతం ఉండగా 11 ఏళ్ల సుదీర్ఘ కాలం అనంతరం తాజాగా నిర్వహించిన సర్వేలో మరో 2 శాతం పెరిగినట్లు తెలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చల్లా మిథున్, మునిగాల అరుణ్, చినపెల్లి బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్’ను జయప్రదం చేయండి

వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ప్రకటించడంతోపాటు రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణం కల్పిస్తామని, రైతుబంధు పెంపు, పింఛన్, తదితర అనేక హామీలు ఇచ్చినా అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని విమర్శించారు. ఎన్నికల హామీలేవీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అర్హులైన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని నమ్మించి కాంగ్రెస్ నాయకులతో వేసిన కమిటీ ఇళ్లు ఇస్తుందని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు బనాయించడాన్ని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. 20న ఉదయం 11 గంటలకు సుందరయ్య పార్కు నుంచి ఇందిరా పార్క్ వరకు ప్రజాప్రదర్శన ఉంటుందని తెలిపారు. అనంతరం ధర్నా చౌక్‌లో తలపెట్టిన బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని వెంకటేశ్వరపల్లికి చెందిన మంద పద్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. తొలుత మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నలమాస సారయ్య, బీఆర్‌ఎస్ నాయకులు గొట్టం ప్రతాప్‌రెడ్డి, పొన్నం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడి దుర్మరణం

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని నీరుకుళ్ల గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మత్స్యశాఖ మాజీ చైర్మన్, ముదిరాజ్ సంఘం నాయకుడు బయ్య తిరుపతి(40) నీరుకుళ్లలో ఓ కార్యక్రమానికి బైక్‌పై వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో నీరుకుళ్ల శివారులో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతి తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. తిరుపతి కాంగ్రెస్ పార్టీ మండల కమిటీలో క్రియాశీలక నాయకుడిగా పని చేస్తున్నాడు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా అతడి మృతి పార్టీకి తీరనిలోటని ‘కుడా’ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంపై ఆయన అడిగి తెలుసుకున్నారు. తిరుపతి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నెక్కొండ : సమ్మేళనంలో నాటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

నెక్కొండ : మండలంలోని సూరిపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో 2004–05 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుదీర్ఘ కాలం తర్వాత ఒకరినొకరు కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనంద డోలికల్లో తేలియాడారు. స్నేహాన్ని కొనసాగించాలని, ఒకరికొకరు అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులైన రాపాక సదానందం, గోవర్ధన్, ధన్‌సింగ్, వెంకటేశ్వర్లు, అండాలు, రవీందర్‌లకు జ్ఞాపికలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు నరేందర్, వేణు, జయరాం, రాజు, మహేశ్, అనిల్, శ్రీను, ప్రతాప్, నెహ్రూ, వీరస్వామి, కవిత, సుష్మ, స్వాతి, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు హైస్కూల్‌లో..

రాయపర్తి : మండలంలోని కొత్తూరు ప్రభుత్వ హైస్కూల్‌లో 2004–05 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి చిలిపి జ్ఞాపకాలు, అనుభవాలను గుర్తు చేసుకుంటూ రోజంతా పాఠశాలలో గడిపారు. సామూహికంగా భోజనాలు చేసి ఆత్మీయత చాటుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వివిధ కారణాలతో మృతి చెందిన తమ పదో తరగతి నాటి మిత్రుల కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు వెంకటేశం, వెంకటేశ్వర్‌రావు, యాదవరెడ్డి, ప్రభాకర్‌రావు, పూర్వవిద్యార్థులు శ్రవణ్, నాగరాజు, రంజిత్, చంద్రశేఖర్, శాంతికుమార్, సురేశ్, రజిత, రాజేశ్వరి, కోమల, సంపత్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



రాయపర్తి : కొత్తూరు హైస్కూల్‌లో..

మరియపురంలో..

గీసుకొండ : మండలంలోని మరియపురంలోని సెయింట్ జాన్స్ హైస్కూల్‌లో 1998–99 బ్యాచ్ పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారు 26 ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకుని తమ అనుభవాలను పంచుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. నాడు తమకు విద్యాబోధన అందించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులైన ఎస్‌బీఐ మేనేజర్ ప్రమోద్, చోళ మండల్ ఫైనాన్స్ సంస్థ మేనేజర్ బిల్ల కోటేశ్వర్, పోలీసు అధికారి సుమతి, రెవెన్యూ అధికారి మేడిద రాజ్‌కుమార్, పెండ్లి కళాధర్, నిమ్మ సుమన్, శంకర్, రాజ్‌కుమార్, సతీశ్‌రాజు, పావని, వనిత, గీత, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట : హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో శనివారం జరిగిన గణిత, ఒలింపియాడ్ పరీక్షల్లో నర్సంపేటలోని విజ్‌డమ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర, జిల్లా స్థాయిలో పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ జావేద్ అభినందించి మాట్లాడారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న కౌశిక్ గణిత ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో, నాల్గో తరగతి విద్యార్థి మీర్ ఉస్మాన్ అలీ సైన్స్ ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే గణిత, సైన్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు ముంజాల సాయికిరణ్, అనన్య, అర్జున్, అన్వేశ్, సుహాస్ ప్రిన్స్, తొమ్మిదో తరగతి విద్యార్థులు అర్మాన్ షా, ఫర్మాన్ షా, అబ్దుల్ ముభీత్, మనోజ్ఞ, ఎనిమిదో తరగతి విద్యార్థులు దాసరి నిహారిక, సాయిహర్ష, బేరి మనోజ్ఞ, సుశాంత్, ఏడో తరగతి విద్యార్థులు అసద్, సుశాంత్, కొప్పు యశ్వంత్, విశ్వేశ్ చౌహాన్, చెన్నబోయిన చరణ్, షహజాద్, ఆరో తరగతి విద్యార్థులు పుల్లూరి రాజాగౌడ్, శశిధర్, శ్రీనిధి, నాసిర్ అలీ, ఐదో తరగతి విద్యార్థులు అంకిత్‌చంద్ర, సాత్విక్ కృష్ణ, శ్రీహిత్‌రెడ్డి, చరణ్, నాల్గో తరగతి విద్యార్థులు మీర్ ఉస్మాన్ అలీ, మహ్మద్ డ్యానిష్, షణ్ముఖ ప్రియ, మూడో తరగతి విద్యార్థులు హిమాచరిత్‌రెడ్డి, ప్రేమ్ విరాన్, తన్మయ్ జిల్లా స్థాయిలో బహుమతులు సాధించారని చెప్పారు. విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ జహంగీర్, అకాడమిక్ ఇన్‌చార్జ్ నాజియా ఇక్బాల్, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీమ్ సుల్తానా, రఘుపతిరెడ్డి, శివరాజ్, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామస్తుల ఐక్యతే అభివృద్ధికి పునాది

- ‘బాలవికాస’ ఫెడరేషన్ డైరెక్టర్ కృష్ణారెడ్డి

దుగ్గొండి : గ్రామస్తుల ఐక్యతే అభివృద్ధి పునాది అవుతుందని బాలవికాస వాటర్ ప్లాంట్ ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని నాచినపల్లిలో కన్నెబోయిన చంద్రమౌళి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన బాలవికాస మినరల్ వాటర్ ప్లాంట్ 19వ వార్షిక మహాసభకు కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. బాలవికాస సాంఘిక సేవా సంస్థ గ్రామాల్లో ప్రజలకు తాగునీటి, ఇతర వసతులు కల్పిస్తూ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోందని తెలిపారు. వాటర్ ప్లాంట్ నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు. గ్రామస్తులు వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామస్తులు ఏకతాటిపై ఉంటే అభివృద్ధికి బాటలు పడతాయని చెప్పారు. ఒక్కరుగా సాధించలేని అభివృద్ధిని కలిసి కట్టుగా సాధించవచ్చని నిరూపించారంటూ గ్రామస్తులను అభినందించారు. తొలుత వాటర్ ప్లాంట్ జమ, ఖర్చు వివరాలను వెల్లడించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన చంద్రమౌళి, ఉపాధ్యక్షుడుగా మాదాసి సాంబయ్య, కార్యదర్శిగా కొత్తపల్లి శివ, సహాయ కార్యదర్శిగా వడ్డెపల్లి కిరణ్, కోశాధికారిగా జన్ను కిరణ్, సభ్యులుగా బండారి ఉప్పలయ్య, నల్ల భాస్కర్‌రెడ్డి, శ్రీరామోజు లక్ష్మీనారాయణ, జెట్టి ప్రశాంత్, గోవిందు ఎలేందర్, వడ్డెపల్లి బంగారి, పెండ్యాల సూరయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ ఇజ్జగిరి, పెండ్యాల రాజు, జంగ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

వివరాల నమోదుకు అవకాశం

ఆత్మకూరు : సమగ్ర ఇంటింటి సర్వేలో వివరాలు నమోదు చేసుకోని ప్రజలు ఈనెల 28లోగా మరోసారి నమోదు చేసుకునేందుకు ప్రజాపాలన కేంద్రాల్లో సమాచారం అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆసక్తి లేకపోవడం తదితర కారణాలతో సర్వే చేయని కుటుంబాలకు ఈనెల16 నుంచి 28వ తేదీ వరకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. టోల్-ఫ్రీ నంబర్ 040–21111111కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కాల్ చేసి సమాచారం అందజేయవచ్చని తెలిపారు. లేదా ఆన్‌లైన్ ద్వారా ఫారమ్ డౌన్‌లోడ్ చేసుకుని సంతకం చేసిన అనంతరం ఎంపీడీఓ ఆఫీస్‌లోని ప్రజాపాలన సేవా కేంద్రంలో సమర్పించవచ్చని వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శివరాత్రి వైభవంగా నిర్వహిస్తాం

ఖిలా వరంగల్ : ఈనెల 26న నిర్వహించే శివరాత్రి పర్వదినాన్ని శివశక్తి వినాయక మందిరంలో వైభవంగా నిర్వహిస్తామని గౌరవ అధ్యక్షుడు బైరబోయిన దామోదర్, అధ్యక్షుడు సిద్ధం రాము పిలుపునిచ్చారు. ఆదివారం ఖిలావరంగల్ పెట్రోల్‌బంక్ జంక్షన్‌లో ఆలయ ప్రధాన కార్యదర్శి చెన్నూరి దేవేందర్ అధ్యక్షతన నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ మహాశివరాత్రి ఉదయాన్నే శివశక్తి వినాయక మందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని, భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గజ్జెల శ్యాం,వడ్డెపల్లి భరత్, రఘు, శ్రీనివాస్, నాగరాజు, పెద్దపల్లి వరప్రసాద్, మోహన్‌నాయుడు, నవీన్, చక్రధారి, అచ్చవినోద్‌కుమార్, అనిల్, వంశీ కృష్ణ, భరత్, చేరాలు, తదితరులు పాల్గొన్నారు.